గురువారం, ఏప్రిల్ 11, 2024

4 PM

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

Smart Edition

ఆ ఎమ్మెల్యేల ఇంటి ముందు

## సావు డప్పు కొడతాం..

డిపాజిట్ రాకుండా చేస్తాం

2



# ధాన్యం కొనుగోళ్లల్లో నిర్లక్ష్యం వహించొద్దు..

## సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్లల్లో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రైతుల కష్టాన్ని ఎవరైనా మార్కెట్ కమిటీ అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై తక్కువ చేయడానికి ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ మేరకు వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు.

**ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. ఈ మేరకు సంబంధిత వ్యవసాయ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లలో జరిగిన ఘటనపై రేవంత్ అధికారులను మందలించారు.**

రైతులను మోసం చేయడానికి ప్రయత్నించిన నలుగురు ట్రేడర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఆదేశించిన అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్‌కి అభినందనలు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా అధికారులందరూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. కాగా మరోవైపు ధాన్యాన్ని కొనట్లేదని రైతులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. అసలే వేసవికాలం పొలంలో ధాన్యం ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పలుమార్లు ధాన్యాన్ని కొనాలని రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. రైతుల విన్నపంతో ప్రభుత్వం త్వరగా ధాన్యాన్ని కొనాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా తమకు సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

### ఢిల్లీకి రేవంత్.. ఈసారైనా క్లారిటీ వస్తుందా?

ఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు. సాయంత్రం (ఆప్ కీ అదాలత్) టీవీషో కార్యక్రమంలో రేవంత్ పాల్గొననున్నారు. నేడు తెలంగాణలోని మూడు లోక్‌సభ పెండింగ్ స్థానాలపై అధిష్టానం పెద్దలతో చర్చించే అవకాశం ఉంది.

## ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి..

సీఎం రేవంత్‌పై హరీష్ ఆగ్రహం



## ట్యాపింగ్‌పై సీపీ తొలి రియాక్షన్

- ఫోన్ ట్యాపింగ్‌లో ఎన్నో మలుపులు...
- రిమాండ్ రిపోర్ట్‌లో అనేక కీలక విషయలు
- పొలిటికల్ లీడర్ల నోటీసులపై త్వరలో వెల్లడిస్తాం

2



హైదరాబాద్, ఏప్రిల్ 11: తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఎంతటి దుమారాన్ని రేపుతుందో అందరికీ తెలిసిందే. రాజకీయ నేతల ఫోన్‌లను ట్యాపింగ్ చేశారనే వార్త రాష్ట్ర వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. ఈ కేసులో ఆనాటి పోలీసు ఉన్నతధికారులు అరెస్ట్ అవగా.. వారి రిమాండ్ రిపోర్ట్‌లో అనేక కీలక విషయలు వెలుగులోకి వచ్చాయి. తాజాగా ఈ వ్యవహారంపై హైదరాబాద్ సీపీ కొత్త కోట శ్రీనివాస్ రెడ్డి మొదటిసారి స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు పారదర్శకంగా విచారణ కొనసాగుతోందన్నారు. సమయం వచ్చినప్పుడు అన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు. పొలిటికల్ లీడర్ల నోటీసులపై త్వరలో వెల్లడిస్తామని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## కవిత మరోసారి అరెస్ట్..



దేశవ్యాప్తంగా పెనుసంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇంకా ఈడీ కస్టడీలో తీహార్ జైలులో ఉండగానే రంగంలోకి దిగిన సీబీఐ విచారించింది. తీహార్ జైలు వేదికగా జరిగిన ఈ విచారణ తర్వాత కవితను సీబీఐ అధికారులు అరెస్ట్ చేయడం జరిగింది. ఈ మేరకు కవిత అరెస్ట్‌ను అధికారికంగా సీబీఐ ప్రకటించింది.. కోర్టుకు కూడా తెలిపింది. దీంతో అరెస్టయిన కస్టడీలో ఉన్న కవిత మరోసారి అరెస్ట్ అయినట్లయ్యింది. అటు ఈడీ.. ఇటు సీబీఐ కూడా అరెస్ట్ చేయడంతో ఢిల్లీ లిక్కర్ కేసులో కీలక పరిణామమే చోటుచేసుకుందని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి.

2

## కండక్టర్‌పై దాడి ..ఇద్దరికి జైలు



పోలీసులను అభినందించిన వీసీ సజ్జనార్ గద్వాల జిల్లాలో కండక్టర్ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాడికి పాల్పడిన కేసులో ఇద్దరు వ్యక్తులకు స్థానిక కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 చొప్పున జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే.. బీ కృష్ణయ్య అనే కండక్టర్ గద్వాల ఆర్టీసీ డిపోలో విధులు నిర్వర్తిస్తున్నారు. 15 మారి

2

## గడ్డం వివేక్ కుటుంబంలో ముగ్గురికి టికెట్ ఎట్లిస్తరు..?..

ప్రశ్నించిన మోత్కుపల్లి 02





పూలే ఎంచుకున్న మార్గం ..

## అందరికీ ఆచరణీయం..

హైదరాబాద్, ఏప్రిల్ 11: మహాత్మ జ్యోతిరావు పూలే ఎంచుకున్న మార్గం, ఆయన బోధనలు అందరికీ ఆచరణీయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

2

## కాంగ్రెస్ నాయకులు మాదిగ పల్లెలకు వస్తే ...



సూర్యాపేట : కాంగ్రెస్ నాయకులు మాదిగ పల్లెలకు వస్తే తరిమికొడుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపై మాదిగలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. మాదిగ పల్లెలకు ప్రచారానికి రాకపోవడం కాంగ్రెస్‌కు మంచి చేయదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాల లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనేది అక్షర సత్యమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మాదిగలకు మూడు పార్లమెంట్ టికెట్లు ఇవ్వకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

## ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి..

### సీఎం రేవంత్‌పై హరీష్ ఆగ్రహం



సిద్దిపేట: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కి గట్టిగా బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం నాడు చిన్నకోడూరు మండలం పెద్ద కోడూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హరీష్ రావు, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్ రాంరెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజా శర్మ పాల్గొన్నారు.

**హరీష్ రావు మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో వెంకట్ రాంరెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రులు కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య హయాంలో 6 గంటలు మాత్రమే కరెంట్ వచ్చేదన్నారు.** కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 24 గంటల కరెంట్, సాగునీరు ఇచ్చారని గుర్తుచేశారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. కరువు తెచ్చిందని విమర్శించారు. తెలంగాణలో లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం

2

# ఫోన్ ట్యాపింగ్‌పై సీపీ తొలి రియాక్షన్

హైదరాబాద్, ఏప్రిల్ 11: తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఎంతటి దుమారాన్ని రేపుతుందో అందరికీ తెలిసిందే. రాజకీయ నేతల ఫోన్‌లను ట్యాపింగ్ చేశారనే వార్త రాష్ట్ర వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. ఈ కేసులో ఆనాటి పోలీసు ఉన్నతధికారులు అరెస్ట్ అవగా.. వారి రిమాండ్ రిపోర్ట్‌లో అనేక కీలక విషయలు వెలుగులోకి వచ్చాయి. తాజాగా ఈ వ్యవహారంపై హైదరాబాద్ సీపీ కొత్త కోట శ్రీనివాస్ రెడ్డి మొదటిసారి స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు పారదర్శకంగా విచారణ కొనసాగుతోందన్నారు. సమయం వచ్చినప్పుడు అన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు. పొలిటికల్ లీడర్ల నోటీసులపై త్వరలో వెల్లడిస్తామని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌లో ఎన్నో మలుపులు...

కాగా.. గత నెల రోజులుగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఈ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతల



ఫోన్‌లు ట్యాపింగ్ అయినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. చట్టవిరుద్ధంగా ఫోన్‌లను ట్యాప్ చేయడం, కంప్యూటర్ సిస్టమ్‌లు, అధికారిక డేటాను ధ్వంసం చేయడం వంటి ఆరోపణలతో గత నెలలో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అరెస్ట్‌తో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ప్రణీత్ రావు విచారణ సమయంలో పోలీసులు కీలక సమాచారాన్ని రాబట్టారు.

మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధా కిషన్ రావు ఆదేశాలతోనే ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు విచారణలో తేలింది. అందులో భాగంగానే టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధా కిషన్ రావుతో పాటు మాజీ అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలను పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్‌రెడ్డితో పాటు, ఇతర కాంగ్రెస్ నాయకులు, రియాల్టర్లు, ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు బయటపడింది. ఈ కేసులో ఏ1 నిందితుడిగా మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావును చేర్చారు. ప్రస్తుతం ప్రభాకర్ రావు క్యాన్సర్ చికిత్స నిమిత్తం అమెరికాకు వెళ్లారు. ఆయనపై పోలీసులు లుకౌట్ నోటీసులు కూడా జారీ చేశారు.





అలలు లేని సంద్రం, మొయిలు లేని అంబరం ముచ్చటైన నీలి వర్ణంలో మనసును తేలిపోయేలా చేస్తాయి. ఇంద్రధనుస్సు రంగుల్లో తక్కువ తరంగ దైర్ఘ్యం ఉన్న నీలం అంటే ఫ్యాషన్ ప్రియులకు మక్కువ ఎక్కువే! ఊదా రంగుకు చిక్కదనం హంగు తోడైతే నీలం మరింత వాటంగా మెరిసిపోతుంది. నిశిరాతిరి నీలాన్నంతా అరువు తెచ్చి నేసిన నెట్టెడ్ శారీని చుట్టుకొని కృతి సనన్ సరికొత్త లుక్‌లో ఇలా దర్శనమిచ్చింది. మతులు చెదరగొట్టే ఈ చిత్తరువు చూస్తుంటే ఈ ముదిత నీలాకాశాన్ని తన కౌగిట బంధించినట్టు లేదూ!

## ఎమ్మెల్సీ కవిత మరోసారి అరెస్ట్..





దేశవ్యాప్తంగా పెనుసంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇంకా ఈడీ కస్టడీలో తీహార్ జైలులో ఉండగానే రంగంలోకి దిగిన సీబీఐ విచారించింది. తీహార్ జైలు వేదికగా జరిగిన ఈ విచారణ తర్వాత కవితను సీబీఐ అధికారులు అరెస్ట్ చేయడం జరిగింది. ఈ మేరకు కవిత అరెస్ట్‌ను అధికారికంగా సీబీఐ ప్రకటించింది.. కోర్టుకు కూడా తెలిపింది. దీంతో అరెస్టయిన కస్టడీలో ఉన్న కవిత మరోసారి అరెస్ట్ అయినట్లయ్యింది. అటు ఈడీ.. ఇటు సీబీఐ కూడా అరెస్ట్ చేయడంతో ఢిల్లీ లిక్కర్ కేసులో కీలక పరిణామమే చోటుచేసుకుందని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి.

**వాట్ నెక్స్ట్!**

ప్రస్తుతం కల్వకుంట్ల కవిత తీహార్ జైల్‌లో జ్యూడిషియల్ కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. కస్టడీలో ఉన్న కవితను ఏప్రిల్-06న సీబీఐ విచారించింది. లిక్కర్ కేసులో పాత్రేంటి..? అన్ని కోట్ల డబ్బులు ఎలా చేతులు మారాయి..? ఈ మొత్తం వ్యవహారం వెనుక ఎవరెవరున్నారు..? ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పాత్రేంటి..? తెరవెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారు..? అని చాలా లోతుగా విచారణ చేయడం జరిగింది. ఈ విచారణ అనంతరం కవితను అరెస్ట్ చేయడం జరిగింది. కాగా.. శుక్రవారం నాడు కవితను కోర్టు ముందు హాజరుపరిచే అవకాశముంది. ఈ వరుస అరెస్టులతో గులాబీ పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అసలు ఎదురుదెబ్బలతో సతమతమవుతున్న 'కారు' పార్టీకి ఇదొక మాస్టర్ స్ట్రోక్ అని విశ్లేషకులు చెబుతున్నారు. తాజా వ్యవహారంపై బీఆర్ఎస్ ఏం చేయబోతోంది..? అనేదానిపై పార్టీ శ్రేణుల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## 24న రఘువీర్ రెడ్డి నామినేషన్ : మంత్రి కోమటిరెడ్డి



**నల్లగొండ :** నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి ఈనెల 24న నామినేషన్( వేస్తారని రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం నల్గొండ పట్టణంలో క్లాక్ టవర్ సెంటర్లో ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డితో కలిసి మంత్రి మాట్లాడారు. నామినేషన్ రోజున ఉదయం 9 గంటలకు నల్లగొండ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. 12 గంటలకు నామినేషన్ వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కూడా పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. ముఖ్య నాయకులంతా తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, నల్గొండ జెట్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పలువురు కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


## పూలే ఎంచుకున్న మార్గం అందరికీ ఆచరణీయం..



హైదరాబాద్, ఏప్రిల్ 11: మహాత్మ జ్యోతిరావు పూలే ఎంచుకున్న మార్గం, ఆయన బోధనలు అందరికీ ఆచరణీయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కేటీఆర్, మధుసుధనాచారి, బీఆర్ఎస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని పూలేకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సమాజంలోని అన్ని వర్గాలు జ్యోతిబాపూలే వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. "మనం ఏ కులం ఏ మతంలో పుట్టాలి అన్న విషయం మన చేతిలో లేదు"న్నారు. ఉపాధి కల్పన అందరికీ సమాన హక్కులు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నదన్నారు. ఈ విషయంలో ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తూ బాధ్యతను నిర్వహిస్తామని వెల్లడించారు.

## గడ్డం వివేక్ కుటుంబంలో ముగ్గురికి టికెట్ ఎట్లిస్తరు..?..

### ప్రశ్నించిన మోత్కుపల్లి



కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు సంచలన వ్యాఖ్యలు చేశారు. 80 లక్షల మంది ఉన్న మా మాదిగలకు ఒక్క టికెట్ ఇవ్వరు కానీ.. గడ్డం వివేక్ కుటుంబంలో మాత్రం 3 టిక్కెట్లు ఎలా ఇస్తారంటూ ఆయన నిలదీశారు. ఒక్క సీటుకు కూడా మా మాదిగలు అర్హులు కారా? మా మాదిగ కులానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పది మంది సీఎంలను చూశాను కానీ.. ఈ రకంగా మాదిగలకు టికెట్ ఇవ్వకుండా ఎవరూ లేరన్నారు.

మాదిగలు ఓట్లు వేయకపోతే కాంగ్రెస్ భవిష్యత్ ఏంటీ? అంటూ ఆయన ప్రశ్నించారు. ఓ కాంగ్రెస్ నాయకుడిగా బాధపడుతున్నానన్నారు. మాదిగ జాతికి రిజర్వేషన్ లేనట్లుగా.. మూడు స్థానాల్లో ఒక్కటి కూడా కేటాయించకుండా అన్యాయం చేస్తుందని.. ఇది మాదిగ జాతికి అవమానకరమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ కోసం రోజు ప్రయత్నం చేస్తున్నా ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం మోత్కుపల్లి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి..

### సీఎం రేవంత్‌పై హరీష్ ఆగ్రహం

సిద్దిపేట: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కి గట్టిగా బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం చిన్నకోడూరు మండలం పెద్ద కోడూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హరీష్ రావు, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్ రాంరెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజా శర్మ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో వెంకట్ రాంరెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రులు కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య హయాంలో 6 గంటలు మాత్రమే కరెంట్ వచ్చేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 24 గంటల కరెంట్, సాగునీరు ఇచ్చారని గుర్తుచేశారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. కరువు తెచ్చిందని విమర్శించారు. తెలంగాణలో లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు లక్షల రుణమాఫీ అయినా రైతులు ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలి... రుణామాఫీ కానివారు బీఆర్ఎస్‌కి ఓటు వేయాలని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు ఓట్లు కోసం వచ్చే ఆ పార్టీ నేతలను మహిళలు చీపురు కట్టలతో తరమాలాని వార్నిగ్ ఇచ్చారు. కాంగ్రెస్‌కి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేస్తే మన కంటిని మనం పొడుచుకున్నట్లేనని ఎద్దేవా చేశారు. సిద్దిపేట అభివృద్ధిని ఓర్వని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావుకి ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గతంలో దుబ్బాక ఉప ఎన్నికల్లో గెలిచిన రఘునందన్ రావు ఏ ఒక్క హామీని ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. అందుకే మొన్నటి అసెంబ్లీ ఆయనను దుబ్బాక ప్రజలు ఘోరంగా ఓడించారని అన్నారు.10 ఏళ్ల బీజేపీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని.. పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు పెరిగాయని మండిపడ్డారు. బీజేపీ నల్ల చట్టలు తెచ్చి 700మంది రైతులను పొట్టన పెట్టుకుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీకి గులాం గిరి చేస్తే, గులాబీ జెండా పట్టుకున్నోళ్లు జై తెలంగాణ అని నినదిస్తారని హరీశ్‌రావు అన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేశా: వెంకట్ రాంరెడ్డి



తాను కలెక్టర్‌గా ఉన్న సమయంలో మెదక్ ఉమ్మడి జిల్లాను ఎంతో అభివృద్ధి చేశానని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్ రాంరెడ్డి తెలిపారు. ప్రజల ఆదరణతో తాను ఎంపీగా పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నానని చెప్పారు. తాను అంచెలంచెలుగా కలెక్టర్ వరకు ఎదిగానని అన్నారు. తాను ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద బలహీన వర్గాలకు సహాయం అందిస్తానని వెంకట్ రాంరెడ్డి హామీ ఇచ్చారు.

## నాది కాంగ్రెస్ రక్తం.. టికెట్ ఇస్తే గెలిచినట్టే..: వీహెచ్

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తాను మద్దతు ఇవ్వడం కొందరికి నచ్చడం లేదని, సీఎం పనిచేస్తున్నారు కాబట్టే సపోర్ట్ చేస్తున్నానని కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. తనది కాంగ్రెస్ రక్తమని, ఖమ్మం ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్ హై కమాండ్‌ను అడిగానన్నారు. ఒకేవేళ తనకు టికెట్ ఇవ్వకపోయినా తానేం తిరుగుబాటు చేయనని స్పష్టం చేశారు.

2019లోనే తాను ఖమ్మం నుంచి పోటీ చేయాలని ప్రయత్నం చేశానని.. రాజీవ్ గాంధీ ఆలోచన మేరకు ఖమ్మం నుంచి పోటీ చేయాలని అనుకున్నానని వీహెచ్ చెప్పారు. ఖమ్మం నుంచి పోటీ చేయడం కోసం అక్కడ గ్రౌండ్ వర్క్ కూడా చేశానన్నారు. తనకు టికెట్ ఇస్తే గెలిచినట్టేనని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తనను ఖమ్మంలో పోటీ



చేయమని చెప్పి, ఇప్పుడు తన భార్యకు టిక్కెట్ కావాలని అడుగుతున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం పార్టీ హైకమాండ్ టికెట్ ఇస్తే ఖచ్చితంగా తన కోసం పని చేస్తామని అంటున్నారని చెప్పారు. సోషల్ ఇంజనీరింగ్ విషయంలో బీజేపీ బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయకుండా చూసుకోవాలని వి.హనుమంతరావు సూచించారు

## బీసీల రిజర్వేషన్లపై మొసలి కన్నీరు కారుస్తున్న కాంగ్రెస్

హైదరాబాద్: బీసీల రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తోందని బీజేపీ రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం నాడు బీజేపీ కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ...మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం పని చేస్తోందని లక్ష్మణ్ తెలిపారు.

గత పాలకులు విస్మరించిన వర్గాలకు మోదీ సముచిత స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. అభినవ జ్యోతి బాపూలే నరేంద్ర మోదీ అని కొనియాడారు. విద్యారంగంలోనే కాకుండా ఉపాధి రంగంలో సైతం అణగారిన వర్గాలకు ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. విశ్వకర్మ యోజన ద్వారా బలహీన వర్గాలను మోదీ ఆదుకుంటున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 30% బీసీలకు సీట్లు ఇచ్చారని తెలిపారు.

గణాంకాల ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు ఆడుతోందన్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్ బీసీ గణన అంటే ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కులాన్ని ఏఐసీసీ



అగ్రనేత రాహుల్‌గాంధీ అడుగడుగునా అవమాన పరుస్తున్నారని ధ్వజమెత్తారు.

జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని .. ఆ ఎన్నికల్లో 46 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించకపోతే సీఎం రేవంత్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముస్లింలను బీసీ జాబితాలో చేర్చి బీసీల హక్కులను కాలరాస్తున్నారని లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఢిల్లీకి రేవంత్.. ఈసారైనా క్లారిటీ వస్తుందా?

ఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు. సాయంత్రం(ఆప్ కీ అదాలత్ ) టీవీ షో కార్యక్రమంలో రేవంత్ పాల్గొననున్నారు. నేడు తెలంగాణ లోని మూడు లోక్‌సభ పెండింగ్ స్థానాలపై అధిష్టానం పెద్దలతో చర్చించే అవకాశం ఉంది. కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్ లోక్‌సభ స్థానాలు పెండింగ్‌లో ఉన్నాయి. మరి ఈసారైనా వీటిపై క్లారిటీ వస్తుందో లేదో చూడాలి. షెడ్యూల్ వచ్చి చాలా రోజులు అవుతున్నా కూడా కాంగ్రెస్ పార్టీ మాత్రం పెండింగ్ స్థానాలపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోవడం లేదు. ముఖ్యంగా ఈ మూడు స్థానాల్లో ఖమ్మం, కరీంనగర్ స్థానాలు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారాయి.

హైదరాబాద్ విషయంలో అయితే పార్టీ అధిష్టానం పెద్దగా ఆలోచించాల్సిన అవసరమైతే లేదు. మిగిలిన రెండు నియోజకవర్గాల్లో ముఖ్యంగా సామాజిక సమీకరణాలతో పాటు పార్టీ కీలక నేతలు తమకు కావాలంటే తమకు కావాలంటూ పట్టుబట్టడంతో రెండూ సమస్యగా తయారయ్యాయి. కరీంనగర్ బీసీకి కావాలంటూ అక్కడి నేతలు పట్టుబడుతుండగా.. ఖమ్మం టికెట్‌ను కమ్మ సామాజిక వర్గానికి కేటాయించాలంటూ కొందరు.. రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించాలని కొందరు.. భట్టి విక్రమార్క సతీమణికి కేటాయించాలని కొందరు.. అందరినీ కాదని మండవ వెంకటేశ్వరరావు సైతం సీన్‌లోకి వచ్చారు. అయితే ఈ రెండు స్థానాల్లో ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్‌లు అభ్యర్థులను ప్రకటించేశాయి. వారు ఇప్పుడు ప్రచారం కూడా నిర్వహించుకుంటున్నారు. ఈసారైనా ఈ మూడు స్థానాలపై క్లారిటీ వస్తుందో రాదో చూడాలి.

## ఆ ఎమ్మెల్యేల ఇంటి ముందు సావు డప్పు కొడతాం..

### డిపాజిట్ రాకుండా చేస్తాం



హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఫైర్ అయ్యారు. గురువారం బీఆర్ఎస్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నిప్పులు చెరిగారు. కేసీఆర్ పెట్టిన భిక్షతో గెలిచి నేడు పార్టీ మారడం సిగ్గు చేటన్నారు. నిజంగా రోషం ఉంటే కడుపుకు అన్నం తింటుంటే, మీరు నిజంగా మొగోల్లు అయితే రాజీనామా చేసి మళ్లీ పోటీ చేసి గెలువాలని సవాల్ విసిరారు. ఎవరిని కూడా వదిలే ప్రసక్తే లేదన్నారు. ఆ ముగ్గురి నియోజకవర్గాల్లో బై ఎలక్షన్స్ వస్తాయని, వారి డిపాజిట్ గల్లంతవడం ఖాయమని పేర్కొన్నారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేల ఇంటి ముందు ధర్నాలు చేసి.. సావు డప్పు కొడతామని హెచ్చరించారు. స్వార్ధ ప్రయోజనాల కోసమే పార్టీలు మారారని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## కండక్టర్‌పై దాడి కేసులో ఇద్దరికి జైలుశిక్ష..



పోలీసులను అభినందించిన వీసీ సజ్జనార్ గద్వాల జిల్లాలో కండక్టర్ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాడికి పాల్పడిన కేసులో ఇద్దరు వ్యక్తులకు స్థానిక కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 చొప్పున జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే.. బీ కృష్ణయ్య అనే కండక్టర్ గద్వాల ఆర్టీసీ డిపోలో విధులు నిర్వర్తిస్తున్నారు. 15 మార్చి 2015న అలంపూర్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్న బస్సులో డ్యూటీలో ఉన్నారు. అలంపూర్ వద్ద తాగిన మత్తులో చాకలి శ్రీనివాస్, గోపి బస్సు ఎక్కి డోర్ వద్దే నిల్చొని అసభ్యంగా ప్రవర్తించారు. బస్సెక్కే ప్రయాణికులను అసభ్యంగా తాకడం, ఉమ్మివేయడం వంటి వికృత పనులు చేస్తుండడంతో గమనించిన కండక్టర్ ఇద్దరిని మందలించారు.

దాంతో కోపోద్రిక్తులైన ఇద్దరు కండక్టర్‌పై దాడికి పాల్పడ్డారు. తిరుగు ప్రయాణంలోనూ మళ్లీ అదే బస్సెక్కి కండక్టర్ విధులకు ఆటంకం కలిగించడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో గద్వాల కోర్టు తీర్పును వెలువరించింది. ఇద్దరిని దోలుషుగా తేల్చింది. ఇద్దరికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది. ఈ ఘటనపై ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పందించారు. ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడితే సహించమని స్పష్టం చేశారు. దౌర్జన్యాలకు దిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్, ఆర్టీసీ అధికారులకు యాజమాన్యం తరఫున అభినందనలు తెలిపారు.